# ఆకాసినరకం

కె. వరలక్ష్మి

జానకి మత్తుగా కళ్ళు తెరిచింది. ఎదుటి దృశ్యం అలుక్కుపోయి నట్లుం దామెకి. చూస్తున్నదాన్ని గ్రహించ డానికి ఆమె మెదడు సహకరించడం లేదు. నిస్సహాయంగా కళ్ళు మూసుకుంది. అంతే, మళ్ళీ మగతగా ట్రాన్స్‌లోకి జారిపోయింది.

నిద్రలోకూడా ఆమె అంతర్యం వెక్కి వెక్కి ఏడుస్తోంది. గతకాలపు జ్ఞాపకాల్లోకి దూసుకు పరుగెడుతోంది.

జానకి తండ్రి మధ్యతరగతి గృహస్థు. ముద్దబంతిపువ్వులాంటి పదిహేనేళ్ల జానకిని మెకానికల్ వర్క్‌షాపు నడుపుకునే బాలరాజు చేతిలో పెట్టి నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు.

పెళ్లినాటికి బాలరాజుది అంతంత మాత్రపు ఆదాయమే అయినా జానకి పాదం పెట్టిన వేళావిశేషమో ఏమో అన్నట్టు సంపాదన బాగా పెరిగింది. మరీ ముక్కు పచ్చలారనట్లు కన్పించే జానకిని ముప్ఫయ్యేళ్ళ బాలరాజు మురిపెంగా చూసుకునేవాడు. ఆ మురిపెంలో భాగంగా మరో అయిదేళ్ళవరకూ తల్లికాకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు.

క్రమంగా బాలరాజు ఆదాయం ఐదంకెల్ని దాటింది. కావడానికి వాళ్ళున్నది పల్లెపట్నంకాని ఊరే అయినా గ్రాండ్‌నేషనల్ ట్రంక్‌రోడ్‌లో నాలుగురోడ్లకూడలి అది. పదిమందికి పైగా వర్కర్లని నియమించు కుని పనిలో జాప్యం జరగకుండా జాగ్రత్తపడేవాడు బాలరాజు, అందుకే అతని వర్క్‌షాపు మూడుపువ్వులూ ఆరు కాయలుగా ఎదిగింది.

ఇరవైఒకటోఏట జానకి తల్లైంది. మొదటి కాన్పులో ఆడపిల్ల అదృష్టదేవత అన్నారంతా, 'ఇద్దరు పిల్లలుచాలు మనకి' అన్న బాలరాజు రెండోకాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో 'ముచ్చటగా మూడోసారి చూద్దాం' అన్నాడు. మూడో అమ్మాయి తర్వాత బాలరాజు దృష్టి జాతకాల మీదికి పోయింది. నిజానికి బాలరాజు పెద్దగా చదువుకోలేదు జాతకాల్ని నమ్మక పోడానికి అఫ్‌కోర్స్ కొందరు గొప్ప స్కాలర్స్ కూడా జాతకాన్ని పిచ్చిగా నమ్మడం అది వేరే సంగతి. బాలరాజు జాతకంలో నలుగురు అమ్మాయిల తర్వాత అబ్బాయి పుడతాడని ఉందట. వంశోద్ధారకుడు కావాలనుకునే మూర్ఖత్వంలో బాలరాజుకి జానకి సహకారం కూడా ఉంది. నలుగురను కున్నది అయిదుగురి తర్వాత ఉద్భవించాడు వంశాకురం.

జానక్కి ఇరవైఏళ్లు దాటేక కాన్పు రావడంతో మొదటి ముగ్గురు పిల్లలూ ఆరోగ్యంగానే పుట్టారు. తర్వాత క్రమంగా జానకి ఓపిక తరిగి పోవడం మొదలై పిల్లలు పీలగా పుట్టేరు. ఎదుగుదలలోనూ ఆ




వ్యత్యాసం స్పష్టంగా తెలుస్తోంది.

'అయ్యో, ఆడపిల్లలే' అని బాలరాజు ఏనాడు బాధపడలేదు సరికదా వాళ్లు కోరుకున్న బట్టలూ, కోరని చిరుతిళ్లూ తెచ్చిపడేసేవాడు. క్రమంగా ఆదాయంతో బాటు సంతానం పెరుగు తుంటే జానకితో సాన్నిహిత్యం సరిగా వీలుపడక బాలరాజుకి వ్యసనాలు పుట్టుకొచ్చేయి. స్నేహితులు బాలరాజులో వ్యసనాల నారుని నాటితే, డబ్బుదానికి నీరు పోసింది. క్రమంగా బాలరాజు హైసొసైటీ కెదుగుతున్నానని తనని తనే మభ్యపెట్టుకుంటూ బారుల్లో గడపడానికి అలవాటు పడ్డాడు. అతని దృష్టిలో తాగడం గొప్ప ఫేషన్.

పదహారేళ్లు రాగానే పెద్దకూతుర్ని లక్షల కట్నంపోసి ఓ సినిమా ప్రొడ్యూసర్ కొడుక్కిచ్చి పెళ్లిచేసాడు. ఆ పెళ్లి తమాషాగా కుదిరింది.

బాలరాజుకి సినిమాలవాళ్లంటే క్రేజ్. ఆ ఏరియాలో షూటింగ్‌కోసం వచ్చిన ఒక సినిమా యూనిట్‌ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించేడు. ఆ రోజు వర్క్‌షాపు మూసేసి పనికుర్రాళ్ల చేత అన్ని ఏర్పాట్లూ చేయించి చాలా హడావుడి చేసాడు. ఆ రాత్రికి గ్రాండు



లిక్కర్ పార్టీ ఇచ్చాడు. డిస్ట్రిబ్యూటర్ల సాయంతో లోబడ్జెట్టు సినిమాలు తీసే ఆ ప్రొడ్యూసరు బాలరాజు ఇల్లూ, ఆదాయం, పరివారం చూసి డంగైపోయాడు. బంగారు గుడ్లు పెట్టే బాతులా కన్పించేడతనికి బాలరాజు.

డిగ్రీ ఫెయిలై రోడ్లమీద బలాదూర్ తిరుగుతున్న తన కొడుకు సుగుణాలు తెలిసిన వాళ్లెవరూ వాడికి పిల్లనివ్వరని అతనికి తెలుసు. అందుకే బాలరాజుకి వలవేసాడు. అ వల్లో బాలరాజు సునాయాసంగా చిక్కుకున్నాడు.

పదోతరగతి చదువుతున్న ప్రమీల పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని ఛెంగుఛెంగున గెంతుతూ వచ్చింది. తెల్లగా బొద్దుగా ఉన్న ఆ పిల్ల అందంకన్నా వాళ్లనాన్న డబ్బు అందంగా కన్పిస్తానే ఉంది. అప్పటివరకూ బాలరాజు సంపాదించిన డబ్బులో సగంపైనే ఆ పెళ్లికి ఖర్చుపెట్టాడు. అల్లుడికి అలకపాన్పుమీద కొత్త బుల్లెట్ షోరూంనుంచి తెప్పించి ఇచ్చాడు.

ఆ పెళ్లికొచ్చి ఈ వైభవం అంతా చూసిన ప్రొడ్యూసర్ చుట్టం ఒకాయన పదమూడేళ్ళ వనజని మెడిసిన్ ఫైనలియర్ చదువుతున్న తన కొడుక్కి సంబంధం సెటిల్ చేసుకున్నాడు. అబ్బాయి హౌస్‌సర్జన్ అయ్యేసరికి వనజ యుక్తవయస్కురాలైంది. అబ్బాయి అమెరికా వెళ్లాలంటున్నాడు కాబట్టి పెళ్లి జరిపించెయ్యమని తొందరపెట్టాడు వియ్యంకుడు. పెళ్ళిచేసి, అల్లుణ్ణి అమెరికా పంపించి వెనక్కి తిరిగి చూసుకునే సరికి బాలరాజు నిండా మునిగిపోయున్నాడు. ఇష్టపడి కట్టుకున్న ఇల్లుకూడా తాకట్టులో కెళ్లింది.

పెద్దగా చదువుకోని జానకికి వ్యవహార జ్ఞానం తక్కువ. బాలరాజకీ పిల్లలకీ వేళకి అన్నీ అమర్చిపెట్టడమే తన ధ్యేయం అనుకుంటుంది. కార్యేషు దాసియే కాని కరణేషు మంత్రి కాదామె.

ఇంతకాలం సజావుగా సాగిన బాలరాజు వర్క్‌షాపుకి పోటీషాపులు వెలిసాయి. అతని దగ్గర పని నేర్చుకున్న కుర్రాళ్లే అనుభవం గడించి సొంతంగా షాపులు పెట్టుకున్నారు. అందుకు ముఖ్యకారణం బాలరాజుకి వర్క్‌షాపుమీద శ్రద్ధ తగ్గడం. పనివాళ్లమీద షాపు వదిలేసి నిరంతరం పేకాటలో కూర్చుంటున్నాడు. ఇక తాగడం సరే సరి!

కొన్నాళ్లు మరచిపోయేనరికి అప్పుకొమ్మలు రెమ్మలేసింది. బాకీదార్లు ఇల్లు సొంతం చేసుకున్నారు. బాలరాజు కుటుంబం వైకుంఠపాళీలో పెద్దపాము నోట్లోపడి, తిరిగి మొదటిస్థితి కొచ్చింది. కాకపోతే అప్పుడు ఆదాయం ఎక్కువ, తినేవాళ్లు తక్కువ. ఇప్పుడది తిరగబడింది. చూసే నాథుడేలేక వర్కర్స్‌లో క్రమశిక్షణ మాయమైంది. పనివాళ్ళు తినెయ్యగా మిగిలింది జీతాలకి కూడా సరిపోవడం లేదు. క్రమంగా పనివాళ్ళు ఒక్కొక్కళ్ళూ జారుకుని అవతలి షాపుల్లోకి వెళ్లిపోయేరు. వర్క్‌షాపు మూతపడింది. ఆరేకుల షెడ్లోకి ఇళ్ళఅద్దెలు కట్టలేని బాలరాజు కుటుంబం తరలి వెళ్లింది.

ఇదివరకు బాలరాజు దగ్గర పనిచేసిన రాఘవులు బాలరాజు స్థితికి జాలిపడి తన వర్క్‌షాపులో పని ఇచ్చేడు. కాని, సుఖానికి అలవాటు పడిన బాలరాజు శరీరం పని చేయనని మొరాయిస్తోంది. ఒకరోజు పనికెళ్తే వారం రోజులు పడకేస్తున్నాడు.

జానకివీ పిల్లలవీ చిన్న చితకా నగలు కూడా కాళ్లొచ్చి నడిచి వెళ్లాయి. ఇంట్లో సామాన్లు అమ్మి ఇల్లు గడుపుతోంది జానకి. ఇంట్లో అందరూ తిన్నా తినకపోయినా బాలరాజు తాగడానికి మాత్రం డబ్బులివ్వాల్సిందే.

మనిషి ఎత్తుకెదగడం కష్టం. దిగజారి పోవడం సులభం. ఎత్తుకెదిగిన మనిషి ఒక విధమైన గర్వానికిలోనై నిర్లక్ష్యాన్ని అలవాటు చేసుకుంటాడు. ఆ సమయంలోనే దురదృష్టవంతులకి పతనం ప్రారంభమౌతుంది. ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ ఆనందాన్ని అనుభవించిన మనిషి దిగజారి పోవడం మొదలయ్యాక అమితాందోళనకి గుర్తై దొరికిన గడ్డి పోచనల్లా బలమైన ఊచగా

భావించి వట్టుకోజూస్తాడు. పూర్తిగా వడిపోయాక ఏదో ఒక వ్యసనాన్ని ఆచ్ఛాదనగా కప్పుకుని ఎస్కేపిజాన్ని ఆశ్రయిస్తాడు. అలాంటి సమయంలో లహరి లాంటి వాళ్ళు ఆ కుటుంబాన్ని ఉద్ధరించడానికి నడుం బిగించాల్సివస్తుంది.

లహరి బాలరాజు మూడోకూతురు.

డబ్బు ఎక్కువై పెద్ద పిల్లలిద్దరి చదువులూ ఆగిపోతే, డబ్బులేక లహరి చదువాగిపోయింది. పదోతరగతి పాసయ్యాక ఆ అమ్మాయి ఇంట్లో వాళ్లకి పూర్తిగా కాకపోయినా, ఒక్కపూటైనా కడుపు నింపడానికి నిశ్చయించుకుంది. ఒక ప్రైవేటు స్కూల్లో టీచరుగా జాయినయ్యింది. అదయ్యాక ట్యూషన్లు చెప్తుంది. రాత్రి నిద్రపోయే వరకూ కుట్టుమిషన్ మీద పని చేస్తుంది. స్వతహాగా తెలివైన ఆ అమ్మాయి ఇంట్లో వస్తున్న మార్పుల్ని జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూ వచ్చింది. అందుకే ఇంట్లో వస్తువులన్నీ పోయినా కుట్టుమిషను మాత్రం బైటికి పోకుండా జాగ్రత్త పడింది. చిన్నతనం నుంచీ లహరికి తల్లికి పనిలో సాయపడ్డం, తనకన్నా చిన్నవాళ్లైన చెల్లెళ్లనీ, తమ్ముణ్ణీ సందరించడం అలవాటు. ఆ అలవాటే ఇప్పుడా అమ్మాయి భుజాలమీదికి బాధ్యతను ఎత్తుకునేలా చేసింది.

కష్టాలు ఒంటరిగా రావుకదా!

అమెరికా అల్లుడు భార్యనింకా తీసుకెళ్ళ లేదు. ఎప్పుడు తీసుకెళ్తాడో తెలీదు, అసలు తీసుకెళ్తాడో లేదో కూడా తెలీదు. ఎందుకంటే, వెళ్ళిన కొత్తల్లో డబ్బు కావాల్సినప్పుడల్లా భార్యకి ప్రేమలేఖ రాసిన ఆ ప్రబుద్ధుడు మావగారు డబ్బు పంపలేని స్థితికి చేరుకున్నాక ఉత్తరం ముక్కైనా రాయడం మానుకున్నాడు. తెలిసిన వాళ్ళద్వారా కబురు చేసి వనజని అత్తవారింటికి పంపించాలని ప్రయత్నించింది జానకి. కబురొచ్చాక తిన్నగా భర్త దగ్గరికే పంపించమనీ, అందాకా పుట్టింట్లోనే ఉంచుకోమని తిరిగి కబురు చేసాడు వనజ మావగారు.

ఇక - ఇద్దరు బిడ్డల తల్లైన ప్రమీల భర్త పెట్టే హింసలు భరించలేక ఏడాదిలో మూడొంతులు పుట్టింట్లోనే ఉంటోంది. ఆ అమ్మాయికి కట్నంగా ఇచ్చిన డబ్బుతో తీసిన సినిమాయేకాక ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా ఫ్లాపై ప్రొడ్యూసరు గారు చతికిలపడ్డాడు. అందుకని 'దరిద్రపు మొహంది' అని తిడుతూ ఉంటారు. అత్తింట్లో ఆమెని. తల్చుకున్నప్పుడల్లా కావాల్సినంత తోడుకుందా మనుకుంటే ఎండిపోయిన బావిలా తయారైన ఆమె తండ్రివల్ల ఆ అమ్మాయి మరింత అసహ్యంగా కన్పిస్తోంది వాళ్లది.

లహరి ఎంత కష్టపడినా అంత పెద్ద కుటుంబానికి సరిపడా తిండి గింజల్నే సంపాదించ లేకపోతోంది. ఈ మధ్య కాలంలో ఆ ఇంట్లో ఎవరూ కొత్త బట్టల ముఖం చూళ్లేదు.

జానకి ఇట్నుంచటు ఒత్తిగిల్లింది. కళ్లు తెరవడానికి ప్రయత్నిస్తోంది. ఆమె అరచేతుల్ని, అరికాళ్లనీ గట్టిగా రుద్దుతున్నారెవరో. గాఢమైన కలలోంచి బైటపడుతున్నట్లనిపిస్తోందామెకి. మెలుకువొస్తోంది, పర్వాలేదింక" అంటున్నారెవరో.

"ఇంకా బతికేయోగం ఉంది కాబట్టి ఇలాగ తెలివి తప్పిపోయింది. లేకపోతే ఆ బాధ తట్టుకోవడం ఎవరి తరమమ్మా" అంటోందో పెద్దావిడ.

జానకి కళ్ళు విప్పింది. మంచం చుట్టూ ఎవరెవరో తెలిసిన వాళ్లూ, తెలీనివాళ్లూ నిలబడి ఉన్నారు. ఆత్రంగా ఆమె ముఖం లోకే చూస్తున్నారు. "పక్కకి తప్పుకోండి, గాలి తగలనీండి" అంటున్నారెవరో. ఏం జరిగిందో గుర్తు రావడానికి కొంత సమయం పట్టింది జానకికి. ఆ సంఘటన స్ఫురణ కొస్తూనే ఆమె కడుపులోంచి దుఃఖం ఎగదన్ను కొచ్చింది. ఒక్క పిచ్చి కేక పెట్టి మంచం మీది నుంచి లేవబోయింది. నలుగురూ కలిసి ఆమెని కదలకుండా పట్టుకున్నారు. అసలే బలహీనంగా ఉండే జానకి దుఃఖంతో సగం ప్రాణం లేనట్టే ఉంది. బాధల్తోనూ, దిగుళ్ళతోనూ రంగు మారిపోయిన ఆమె జుట్టు పాయలు విడిపోయి చిందర వందరగా ఆమె కళ్ళనీ నుదిటినీ కప్పేసింది. మైకంలో కూడా ఆమె ఏడుస్తూనే ఉండడం వల్ల కన్నీళ్లకి తడిసిపోయిన జుట్టు చెంపల నంటుకు పోయింది. అది బాధ అనడానికి వీల్లేదు - ప్రేగుల్ని త్రుంచేస్తున్న విశిఖం.

"అందరూ బైటికి పోండి" కసిరింది పెద్దావిడ. దుఃఖం కొంత ఉపశమించేదాకా ఆవిడ జానకి భుజాల్ని నొక్కిపట్టుకుంది. జానకి అతి ప్రయత్నం మీద నెమ్మదిగా లేచి కూర్చుంది. అంతవరకూ అందరూ చెప్పడం వల్లనైతేనేం, పోలీసుల భయం వల్లనైతేనేం ఏడుపుని గొంతులోనే నొక్కిపట్టి ఎక్కిళ్లు పెడుతున్న పిల్లలంతా తల్లిని చూడగానే ఒక్కసారిగా చేతులుచాచి బావురుమన్నారు. మళ్లీ అంతలోనే భయంతో నోళ్లు నొక్కుకున్నారు.

గదులులేని ఓపెన్‌షెడ్ అది. గోడలూ తలుపులూ లేని ఆ ఇంట్లో ఏం జరిగినా వీధిలో అందరికంటా పడాల్సిందే: పాత దుప్పట్లూ చీరలూ అడ్డం కట్టుకుని ఆడపిల్లలు కొంత మరుగు ఏర్పాటు చేసుకున్నారు. జానకి లేచి వెళ్ళి దుఃఖంతో




ఆ మధ్య మినర్వా టాకీస్‌లో ఒక అధ్వాన్నమైన ఫిల్ము రిలీజు అయ్యింది. ఆనాటి తొమ్మిదిగంటల ఆటకు కొందరు ప్రేక్షకులు, ఒక ప్రేక్షకుడ్ని పట్టుకొని గడమాయిస్తున్నారు! 'ఎందుకయ్యా' అలా గురక పెట్టి చంపుతావు మమ్మల్ని' అని.

దానికి ఆ స్వతంత్ర జీవి "నా యిష్టం నాది. రూపాయి పావలా ఇచ్చి టిక్కెట్టు కొన్నాను. నా సీటులో నేను గురకపెడతాను, నిద్రపోతాను. మీకేం?" అని సవాలు విసిరాడు.

దానికి తక్కిన ప్రేక్షకులలో ఒకడు లేచి "అదేమన్న మాట! మా నిద్ర పాడు చేస్తూ ఇంత గొడవ చేయడం ద్రోహం కాదా?" అని అరిచాడు.

గగ్గోలు పెడుతున్న తన వాళ్లందరి మధ్యా చతికిలబడింది. ఆమె కళ్లల్లో నీళ్లన్నీ ఇంకి పోయినట్టున్నాయి. చిన్నపిల్లలు ఏడుస్తూ తల్లి ఒళ్ళో వాలిపోయారు. పెద్దపిల్ల ప్రమీల తన ఇద్దరు పిల్లల్నీ ఒళ్లో ఉంచుకునే తల్లి భుజానికి చేరబడి పోయింది. వనజ మాత్రం లహరి కాళ్లమీద వంచిన తలపైకెత్త కుండా కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూనే ఉంది.

లహరి శరీరం కష్టసుఖాల కతీతంగా నేలమీద నిశ్చలంగా నిద్రపోతున్నట్టుంది. తెల్లారి లేచింది మొదలు విశ్రాంతి ఎరగని లహరి దాన్ని వెతుక్కుంటూ ఏ లోకాలకో నడిచెల్లినట్టుంది.

మంచం కోడుకి చేరబడి నగం వంగిపోయి కూర్చుని ఉన్నాడు బాలరాజు. మధ్య మధ్య దగ్గొచ్చినప్పుడు మనిషి గాలికి కంపించే ఎండుటాకులా ఒణుకుతున్నాడు.

జానకికి సంగతేంటో కొంచెం కూడా అంతు పట్టడం లేదు. లహరి ఎందుకిలా చేసింది? ఏ సంఘటన తననిలా ప్రాణం తీసుకునేంతగా విసిగించింది? అందరూ తిన్నారో లేదోనని పేరు పేరునా కనుక్కుని గాని నిద్రపోని లహరి రేపట్నుంచి అంతా ఏం తింటారని ఇంతపని చేసింది! కడుపులో పెట్టుకునే కన్నతల్లి తనొక తుందని ఎందుకు మరచిపోయింది? తలచుకున్నకొద్దీ కడుపు తరుక్కు పోతోంది జానకికి.

రాత్రి జరిగిందంతా ఒక్కసారి కళ్ల ముందు కదలాడింది.

అశాంతి వల్లా అనారోగ్యం వల్లా నిద్ర పట్టని జానకి ఈ మధ్య నిద్రమాత్రల నాశ్రయిస్తోంది.

అప్పుడే రెండు మాత్రలు మింగి గాఢ నిద్రలోకి జారుకుంటూన్న జానకి వనజ పెట్టిన కేకకి ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచింది. కొంతసేపటి వరకూ ఏం జరిగిందో అర్థం కాలేదు. ప్రమీలా, చిన్నపిల్లలూ ఓ పక్కా, మంచం మీద అస్తవ్యస్తంగా బాలరాజో పక్కా నిద్రపోతున్నారు. మిషన్ మీద కుడతూన్న పరికిణీ ఏదో కుచ్చిళ్లతో కిందికి వేళ్లాడుతోంది. అంటే లహరి ఇంకా నిద్ర పోలేదన్న మాట! కుడుతూనే లేచెళ్లినట్టుంది.

పిల్లల మధ్యలో వనజ కూడా లేదు. ఇప్పుడు తను విన్నకేక ఎవరు పెట్టిందో అర్థం కాలేదు.

టైమెంతయిందో తెలీదు. మిషన్ దగ్గరున్న హరికెన్ లాంతరు వెల్తురే ఇల్లంతా పల్చగా పరుచుకుని ఉంది. బైటంతా చిమ్మ చీకటి. ఆడ పిల్లలిద్దరూ మరుగుకోసం బైటికి వెళ్లుంటారు. అక్కడే పురుగూ పుట్ర అయినా.....

ఆ ఆలోచన రావడంతోనే జానకి వెన్ను మీద ఎవరో చరిచినట్టు లేచి నుంచింది. వాకిట్లోకి పరుగెత్తబోయిన ఆమె వంటకోసం కట్టిన తడిక వెనుకనించి విన్పిస్తున్న సన్నని ఏడుపువిని అటు పరుగెత్తింది. ఆ ఏడుపు వనజది. అంటే... లహరి... ఆ రెండడుగులూ వేసే లోపల ఎన్నెన్నో ఆలోచన్లు...




తల్లిని చూసి "అమ్మా! లహరి... మన లహరి... చచ్చిపోయిందే" గొంతు నెవరో నొక్కిపట్టుకున్నట్టు సన్నగా ఏడుస్తోంది వనజ. పైకి శబ్దం చెయ్యకూడదన్న భయం ఏదో కన్పిస్తోంది గొంతులో. ఆ చిరు వెలుగులో కూడా వనజ గజ గజ వణికి పోవడం స్పష్టంగా తెలుస్తోంది. నిశ్చలంగా పడి ఉన్న లహరిమీదికి వంగిచూస్తూ "ఏమైందే తల్లీ... ఏమైంది" గట్టిగా కేక పెట్టాలనుకున్న జానకి గొంతు కీచుమంది. అంతే! అప్పుడు విరుచుకుపడి పోయిన జానకికి మళ్లీ ఇప్పుడే మెలకువొచ్చింది.

ఈ లోపల ఏం జరిగిందో, జనం అంతా ఎలా చేరేరో జానకికి తెలీదు. ఆ పెద్దామెతో సహా వాళ్లంతా చుట్టూ ఉన్న గుడిసెల్లోని కూలి జనాలని మాత్రం గుర్తుపట్టింది.

బంగారంలాంటి కూతుర్ని పోగొట్టుకుని కూడా తాగిన మత్తులో తండ్రీ, తాగకుండానే తనూ నిశ్చింతగా నిద్రపోయారు.

చీకట్లింకా విడలేదు కాని, ఏదో చెట్టు మీది నుంచి కాకి అరుపువిని తెల్లవార వస్తోందనుకుంది జానకి. రాత్రంతా తన పిల్లలకి సాయంగా ఉండి, తమ దుఃఖంలో పాలుపంచుకున్న ఆ కూలిజనాల ఋణం 'ఎలా తీర్చుకోగలను!' అనుకుంది.

ఆ ఇంటి వాళ్ల కళ్లతో పోటీపడుతూ తూర్పు ఎర్రబడింది. చెట్లమీది పక్షుల గొంతుల్లో విషాదమొకటే పలుకుతోంది.


వచ్చిన వాళ్ళలో ఎవరో బాలరాజుని లేపి కూర్చోబెట్టేరు. చింతనిప్పుల్లాంటి కళ్ళతో కూతురి శవాన్ని చూసి ఒక్కపెట్టున భోరు మన్నాడు బాలరాజు. చెట్టంత మనిషి అలా కన్నీరవడం చూసి అక్కడున్న అందరి కళ్లూ మళ్లీ చెమర్చేయి.

"గోల సెయ్యకండి బాల్రాజుగోరూ! పిల్ల మందు మింగేసి సచ్చిపోనాది కాబట్టి పోలీసులకి తెలిత్తే కేసవుతాది. ఉన్నోసొలక ఆ సిక్కుల్లో కూడా సిక్కుకుపోతావు. నా బాబు కదా నా మాటిను, తెల్లారిపోకుండానే అన్నీ కానిచ్చెయ్యాల" అంటున్నాడొక ముసలాయన. కావాల్సిన సరంజామా అంతా ఆ జనాలే తెచ్చి, లహరిని అంతి మంగా సాగనంపే సన్నాహం నిశ్శబ్దంగా పూర్తి చేసేరు.

గుండెలు బాదుకుంటూ నేలమీద పడి పొర్లుతున్నాడు బాలరాజు. "నా బంగారు తల్లీ, నా బాలకొండా! ఇంత పనెందుకు

చేసేవమ్మా! ఈ నాన్నమీద అలిగేవా? నాకు తెలుసు, ఈ ఛెండాలుడి మీద కోపమే నీ చేత ఇంత పన్చేయించింది" తన చేతకాని తనానికి నిస్సహాయంగా ఏడుస్తున్నాడు.

ఎవరో బాలరాజు రెక్కపట్టుకుని లేవదీసి నడిపించేరు. నలుగురు మనుషులు పాడెను భజాలకెత్తుకున్నారు. ఎంత అణచుకున్నా ఆగని దుఃఖం కట్టలు తెంచుకోగా అందరూ ఒక్కసారిగా గొల్లుమన్నారు. జానక్కి గర్భంలోని బిడ్డపేగునెవరో తుంచేస్తున్న బాధ, ఆమె గుండెల్నెవరో పిండేస్తున్న విషాదం.




పూర్తిగా తెల్లవారింది. అర్థాంతరంగా బతుకు తెల్లారిపోయిన లహరి గురించి మాత్రం అక్కడున్న ఆ కొద్దిమంది నిర్భాగ్యులకి తప్ప మరెవరికీ తెలీదు.

మరుభూమి నుంచి తిరుగొచ్చే మనుషుల కోసం టీ నీళ్ళు మరగబెడుతున్న వనజ పొయ్యిలోని ఎర్రని మంటని తదేకంగా చూస్తూ కూర్చుంది. ఆమె కళ్లు మాత్రం రాత్రినుంచి ధారాపాతంగా వర్షిస్తూనే ఉన్నాయి. ఆ కాల్వలిక కట్టు బడవేమో అన్పిస్తోంది. మిగిలిన వాళ్లంతా సొమ్మసిల్లి పోయి ఎక్కడి వాళ్లక్కడే నేలమీద పడి ఉన్నారు.

కూడా వెళ్లిన వాళ్లలో నలుగురైదుగురు అప్పుడే వెనక్కి వచ్చేసారు. వాళ్లకి టీ లివ్వడానికి గ్లాసులు కడుగుతున్న ఒకామె మరొకావిడతో "మా ఆయన చూసొచ్చేడు కదా, ఇంత పాడుగున్నాడంట కడుపులో పిల్లోడు. మొగబిడ్డేనంట, శవం కాల్తాఉంటే ఇలాగ పైకిలేసిపోయి గుండెల మీద పడ్డాడంట. ఆ... లేపోతే, వయసులో ఉన్న ఆడపిల్లని పెళ్లి పటాకులూ లేకుండా వదిలేసి, నంపాదిత్తాంది గతా అని ఊరిమీదకి పంపిత్తే తిన్నగా ఉంటాదేటీ...' రాగాలుతీసి అభినయించి మరీ చెప్తోంది.

"ఎందుకే మాలచ్చీ, అలాగ కాని మాట్లాడుకుంటావ్, ముక్కు పచ్చలారని పిల్లని కాలుత్తారా ఎక్కడన్నా... ఆడబిడ్డలున్నదానివి, పాపం పోగేసుకోకే అమ్మా" అంటోంది రెండో ఆవిడ.

పొయ్యిలోని మంట తన గుండెల్లో మండినట్టైంది వనజకి. "పాడు లోకం, పాడు మనుషులు" అనుకుంది కసిగా. అందరి కోసం రెక్కలు ముక్కలు చేసుకున్న దాని బతుకేకాదు, చావుకూడా దాన్నింత కష్టపెడు తోందా! వెక్కి వెక్కి ఏడుస్తోంది వనజ.

ఆకస్మికంగా జరిగిపోయిన ఈ ఘాతుకం తను బతికినన్నాళ్లూ మరవగలదా! జరిగింది కళ్లకి కట్టింది -

రాత్రి అందరూ నిద్రపోయాక తను నెమ్మదిగా పక్కమీది నుంచి లేచింది. తన మనసుని దొలచేస్తున్న సమస్యకి పరిష్కారం ఉదయమే తట్టింది తనకి. దాన్ని అమలు చేసేవరకూ శాంతి లేదు. సాయంకాలం ఎవరికీ తెలీకుండా వెళ్ళి కావాల్సిన డబ్బా కొని తెచ్చుకుంది. దాన్ని వంటంట్లో డబ్బాల వెనుక దాచింది. లేచి వంటింట్లోకి వెళ్తూ ఆఖరిసారి అందరి ముఖాల్నీ పట్టి పట్టి చూసింది. లహరి ఇంకా మిషన్‌మీద ఏదో కుడుతోంది. మధ్య మధ్య ముఖానికి పట్టిన చెమటని పైటతో ఒత్తుకుంటోంది. పాపం! దీని చిన్ని రెక్కల మీద ఎంత బరువు పడింది! రేపట్నుంచి ఈ ఇంటి జన సంఖ్యలో ఒకటి తగ్గుతుంది. అస్తవ్యస్తంగా పడి నిద్రపోతున్న తండ్రిని ఛీత్కారంగా చూసింది వనజ. ఒక ప్లానంటూ లేకుండా ఇష్టం వచ్చినట్టు నడుచుకుని కుటుంబాన్నీ స్థితికి తెచ్చేడు మహానుభావుడు. రెండు చేతులూ జోడించి నిరసన నమస్కారం ఒకటి చేసింది. వెనక్కి తిరిగి చక చకా వంటింట్లో కెళ్లి గుర్తుగా పెట్టిన చోటునుంచి డబ్బాను తీసింది. గ్లాసుతో సగం నీళ్లు ముంచుకుని, వణుకుతున్న చేతుల్తో పురుగుమందు డబ్బా మూతతీసి దాన్లోకి వంపింది.

భయంతో గుండె కొట్టుకుంది. చెమటతో ఒళ్లంతా తడిసిపోయింది. దుఃఖం కడలి తరంగంలాగా ముంచెత్తింది. గ్లాసును పెదవుల కానించుకున్నాక కడుపులో ఏదో కదిలినట్లైంది. ఆ గ్లాసునలాగే మంచినీళ్ళ కుండమీదపెట్టి బైటికెళ్లింది. అంతే! తిరిగొచ్చేసరికి లహరి... లహరిని ఆ మందు పొట్టన పెట్టుకుంది...

నాలుగు తడకలు మరుగుగా కట్టిన ఆ వంటింట్లో ఆ పొయ్యి మంట మీదనుంచి వనజ దృష్టి పొయ్యి కంతలోనుంచి దూరంగా నింగీ నేలా కలుస్తున్న దిశాంతం లోకి పరుగులెత్తింది.

ఏం చెయ్యాలనుకుని ఏం చేసింది తను! ఈ ఇంటి వాళ్లందరికీ అన్నం పెట్టే చేతికి ఒక ప్రాణి బరువును తగ్గించాలనుకుని పొరపాట్న ఆ చెయ్యినే పొట్టన పెట్టుకుంది. అంతేకాదు, రెండేళ్ళుగా కట్టుకున్న వాడి స్పర్శ నెరగని తను ఈ యింటికి ఓ కొత్త ప్రాణినిచ్చి బరువు పెంచబోతోంది. ●